డైనమిక్ జనంవాయిస్ NEWS
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం
PRGI NO: TGTEL/26/A0383

# పారదర్శకంగా అంగన్వాడి టీచర్ పోస్టులు భర్తీ!

## మరిపెడ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ఎం.ఎల్లమ్మ.

**మరిపెడ,సెప్టెంబర్ 07(జనం వాయిస్):**
మరిపెడ ఐసిడిఎస్ ప్రాజెక్టులోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్టులను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని మరిపెడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని ఎం.ఎల్లమ్మ అన్నారు.సోమవారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని హౌసింగ్ బోర్డు ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడి టీచర్ పోస్ట్ లకు దరఖాస్తు చేసుకున్న మహిళ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిల్లా అధికారుల ఆదేశానుసారం,ప్రభుత్వ నియమ,నిబంధనలకు అనుగుణంగా అంగన్వాడీ టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు.ఎలాంటి పైరవీలకు తావు లేదన్నారు.ఆయా పోస్టుల రిజర్వేషన్ ప్రకారము మెజార్టీ అభ్యర్థులకు మాత్రమే పోస్టులను కేటాయిస్తున్నామన్నారు.మహిళా అభ్యర్థులు దళారులను నమ్మొద్దన్నారు.ఎలాంటి రాజకీయ నాయకులు,డబ్బు,ప్రమేయం లేకుండా నిష్పక్షపాతంగా! మెరిట్ అభ్యర్థులను మాత్రమే! ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.అంగన్వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసిన మహిళా అభ్యర్థులు సకాలంలో త్వరితగతిన కార్యాలయాలకు చేరుకొని తమ సర్టిఫికెట్లను పరిశీలించుకోవాలని కోరారు.ఈసర్టిఫికెట్ల పరిశీలనలో ఏ సి డి పి ఓ రోజారాణి,సూపర్వైజర్లుఉషారాణి,రాజ్యలక్ష్మి, మంగాదేవి,శ్రీదేవి,తదితరులు పాల్గొన్నారు.




# కార్యాలయాల ఆవరణలో మద్యం సీసాలు.

## రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలపై ప్రజల అనుమానం.

## కార్యాలయాల భద్రతకై లైటింగ్ ఏర్పాటు చేయాలి.

**మరిపెడ,సెప్టెంబర్ 07 (జనం వాయిస్).**
మరిపెడ పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం,వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో మద్యం,బీరు సీసాలు కనిపించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఇలాంటి సీసాలు దర్శనమివ్వడంతో స్థానిక ప్రజలు ఆందోళన,అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.పగటిపూట ప్రజల సేవల కోసం ఉపయోగించే కార్యాలయాల్లో రాత్రి వేళల్లో ఏం జరుగుతోందనే ప్రశ్న తలెత్తుతోందని స్థానికులు అంటున్నారు.రాత్రివేళల్లో కార్యాలయాల ఆవరణలోకి అనధికారికంగా ఎవరైనా ప్రవేశించి మద్యం సేవిస్తున్నారా,లేక ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కార్యాలయాల చుట్టూ సరైన భద్రత లేకపోవడం,రాత్రిపూట లైటింగ్ లేకపోవడంతో ఇలాంటి ఘటనలకు ఆస్కారం ఏర్పడుతోందని ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పవిత్రత, భద్రత దెబ్బతినకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కార్యాలయాల ఆవరణలోకి రాత్రివేళల్లో ఎవరు వస్తున్నారో తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ కార్యాలయాల భద్రతకు సెక్యూరిటీ గార్డులను నియమించాలని, కార్యాలయ ఆవరణలో లైట్లు ఏర్పాటు చేయాలని,అలాగే కార్యాలయం ఆవరణలో చెత్త శుభ్రం చేపియ్యాలని, పాములు, తేళ్లు కార్యాలయాల్లోకి వచ్చిన సందర్భాలు జరుగుతున్నవి కాబట్టి కార్యాలయ ఆవరణలో చెత్తను శుభ్రం చేపియ్యాలని భద్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన.. హామీలు ఎక్కడ?

**సెప్టెంబర్ 7 జనం వాయిస్ పాలకుర్తి:**
ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం: బి.ఆర్.ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి ఆరోపించారు. హామీల అమలును డిమాండ్ చేస్తూ దేవరుప్పుల మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని పల్లా సుందర్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తీగల దయాకర్ గౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరు సోమన్న బీఆర్ఎస్ నాయకులు, ఏలె సుందర్ కారు పోతుల అంజన్న కార్యకర్తలు పాల్గొన్నారు.




# జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

- ◻ నల్ల ప్యాంటు.. తెల్ల చొక్కాతో హాజరు కావాలి.
- ◻ బొక్కల నారాయణ మాదిగ.

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 7:**
ఈ నెల 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎంఆర్పీఎస్--ఎంఎస్పీ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని మండల ఇన్‌చార్జి బొక్కల నారాయణ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం మండల కో ఇన్‌చార్జి మామిడి భాస్కర్ మాదిగ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సదస్సుకు మండల ఇన్‌చార్జీలు, మాజీ అధ్యక్షులు, మాజీ రాష్ట్ర నాయకులు, గ్రామస్థాయి మాజీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నారాయణ కోరారు. ప్రతి ఒక్కరూ నల్ల ప్యాంటు, తెల్ల చొక్కాతో సదస్సుకు హాజరుకావాలని సూచించారు.

**- సురేందర్‌కు సామాజిక మాధ్యమాల కన్వీనర్ బాధ్యతలు**
ఎంఆర్పీఎస్--ఎంఎస్పీ మండల నూతన సామాజిక మాధ్యమాల కన్వీనర్‌గా కనకం సురేందర్ మాదిగను ఎన్నుకున్నట్లు నారాయణ తెలిపారు. సమావేశంలో ఎంఎస్పీ రాష్ట్ర మాజీ ప్రచార కార్యదర్శి ముక్కెర ముఖేష్ మాదిగ, అరికిల్ల దేవయ్య మాదిగ, తుడుం వెంకటేష్ మాదిగ, మామిడి తిరుపతి మాదిగ, సప్పిడి ప్రభాకర్ మాదిగ, మడికొండ కుమార్ మాదిగ, మారపల్లి చిరంజీవి మాదిగ, మామిడి రాజు మాదిగ, మామిడిపెల్లి సాంబయ్య మాదిగ, అరికెళ్ల వీరయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# నాగార్జున స్కూల్‌పై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలి

◻ ఆరోపణలపై అధికారులు మౌనం వీడాలి : పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్.

**కురవి, సెప్టెంబర్ 7 (జనం వాయిస్):**
నాగార్జున స్కూల్‌పై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ ఆరోపించారు. కురవి మండల కేంద్రంలో సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కురవి గ్రామపంచాయతీ పరిధిలోని నాగార్జున ప్రైవేట్ స్కూల్ భవన నిర్మాణాలు, అనుమతులు, విద్యాశాఖ గుర్తింపు, భవన భద్రత తదితర అంశాలపై వస్తున్న ఆరోపణలపై అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాల భవనానికి ఉన్న అనుమతులు, అదనపు నిర్మాణాలకు పంచాయతీ




అనుమతులు, విద్యాశాఖ గుర్తింపు, భద్రతా ప్రమాణాలను సంబంధిత అధికారులు పరిశీలించాలని కోరారు. ఆరోపణలు వచ్చినప్పటికీ విచారణలో జాప్యం చేయడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు. గ్రామపంచాయతీ, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహించి నిజానిజాలను వెలుగులోకి తేవాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అధికారికంగా స్పష్టత ఇవ్వాలని అన్నారు. గ్రామసభలో తీసుకున్న తీర్మానాన్ని అమలు చేసి, విచారణ నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ డిమాండ్ చేశారు. లేనియెడల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరిక చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ఎన్నికల హామీల అమలులో వైఫల్యం.

## ఉద్యోగ నిరీక్షణతో యువత సహనం కోల్పోతుంది.
## జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు.

**మరిపెడ,సెప్టెంబర్ 07 (జనం వాయిస్).**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు



ఇచ్చిన హామీల అమలులో తీవ్ర జాప్యం,వైఫల్యం జరుగుతోందని భారత రాష్ట్ర సమితి నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు ఆరోపించారు.మరిపెడ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సోమవారం మండల స్థాయి గ్రీవెన్స్ అధికారి,మండల పరిషత్ అభివృద్ధి అధికారికి వినతిపత్రం సమర్పించారు.కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలపై స్పష్టత లేకపోవడం,పలు హామీలు అమలుకు నోచుకోకపోవడం వల్ల వివిధ వర్గాల ప్రజలు నిరాశ చెందుతున్నారని అందులో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, చేనేత, పేదలు తదితర అన్ని వర్గాలకు అనేక హామీలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదన్నారు.ఇటీవల అతివృష్టి వల్ల మరిపెడ మండలం నష్టపోయిందని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సహాయ చర్యలు చేపట్టాలని, ఉద్యోగ నిరీక్షణతో యువత సహనం కోల్పోతున్నారని, స్పష్టమైన ఉపాధి ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్లు,ప్రస్తుత సర్పంచులు,మాజి సర్పంచులు,వార్డు నెంబర్లు,బి ఆర్ ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.150 లక్షల పనులు.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?

- ◻ పనులు నాసిరకం.. పట్టించుకోని అధికారులు!
- ◻ కల్వర్టులకు పగుళ్లు.. తనిఖీలకు రాని వైనం
- ◻ ప్రజాధనం ఖర్చవుతున్నా.. నాణ్యతపై నజరేది?




**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 7:**
శాయంపేట--నాగసముద్రం వయా పత్తిపాక బీటీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని బహుజన సంక్షేమ సంఘం(బీఎస్ఎస్) నాయకులు ఆరోపించారు. ఎం.ఆర్.ఆర్. నిధుల కింద రూ.150 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ పనులపై సోమవారం శాయంపేట మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో బీఎస్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మారపల్లి విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు మారపల్లి సుధాకర్ అధికారులకు ఫిర్యాదు చేశారు.



నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతోపాటు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**◻ ప్రజావాణిలో ఫిర్యాదు.**
రోడ్డు పనుల్లో పలుచోట్ల కంకర పోసి వదిలేయడం, నాగసముద్రం మత్తడి వద్ద నిర్మిస్తున్న లో లెవెల్ వంతెన, నాలుగు కల్వర్టుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని బీఎస్ఎస్ నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మించిన కల్వర్టులు, మోరీలకు పగుళ్లు కనిపిస్తున్నాయని తెలిపారు. పనులు జరుగుతున్న సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ పర్యవేక్షణ కనిపించడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి పనుల నాణ్యతను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగినట్లు తేలితే సంబంధిత కాంట్రాక్టర్‌తోపాటు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**◻ 'కల్వర్టులకు పగుళ్లు'**
రోడ్డు పనులు నాణ్యత లేకుండా చేపడుతున్నారని రైతు మారపల్లి సంజీవయ్య ఆరోపించారు. ఇప్పటికే నిర్మించిన



కల్వర్టులు, మోరీలకు పగుళ్లు కనిపిస్తున్నాయని తెలిపారు. ఇసుక, సిమెంటును సరైన మోతాదులో వినియోగించడం లేదని ఆరోపించారు. దొడ్డు కంకర బదులు చిన్న కంకర(చిప్స్)తో రోడ్డు పనులు చేపట్టి అలాగే వదిలేశారని అన్నారు. పనుల నాణ్యతను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పనులన్నీ నాసిరకంగా ఉన్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**◻ 'అధికారుల పర్యవేక్షణ ఏదీ?'**
రోడ్డును నాణ్యతతో నిర్మించాలని రైతు దైనంపల్లి కుమారస్వామి తెలిపారు. పనులు ప్రారంభమై ఇన్ని రోజులు అవుతున్నా ఏ ఒక్క అధికారి కూడా క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించినట్లు కనిపించలేదన్నారు. తన భూమి కూడా రోడ్డు నిర్మాణం పక్కనే ఉందని పేర్కొన్నారు. పనులు జరుగుతున్న తీరును పరిశీలించాల్సిన అధికారులు కనిపించకపోవడంతో ప్రజాధనంతో చేపడుతున్న పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. కాంట్రాక్టర్ అధికారులను పనుల వద్దకు రాకుండా చేస్తున్నాడా? అనే అనుమానం వ్యక్తం చేశారు. ప్రజాధనంతో చేపడుతున్న పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

# అరెస్టులు కాదు ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వండి


## భాజపా మండల అధ్యక్షుడు మారం రవికుమార్

**సెప్టెంబర్ 7 జనం వాయిస్ పాలకుర్తి:**
తెలంగాణ లో దాదాపు 40 వేల మంది విద్యార్థులకు రావాల్సిన 15వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలు చెల్లించాలి అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు ఛలో అసెంబ్లీ నినాదం తో అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇవ్వగా పాలకుర్తి మండల భారతీయ జనతా పార్టీ నాయకులు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అని మండల అధ్యక్షులు మారం రవికుమార్ అన్నారు.బిజెపి నాయకులను అరెస్ట్ చేయడంపై పెట్టిన శ్రద్ధ విద్యార్థుల ఫీజు బకాయిల పైన పెడితే బాగుంటుంది అని ఇప్పటికి అయినా పూర్తి ఫీజు రీయింబర్స్ చేయాలని అన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు దొంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల దేవరాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు గొనె అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.




# గర్జించిన మహిళా మణులు.. పాలకుర్తిలో కదం తొక్కిన మహిళలు!

**సెప్టెంబర్ 6 జనం వాయిస్ పాలకుర్తి:**
పాలకుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై మహిళల భారీ నిరసన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లిరాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు పాల్గొని మహిళలకు సంఘీభావం తెలిపారు. ఉషా దయాకర్ రావు ఫైర్! 420 హామీలు.. ఆరు గ్యారెంటీలు అంటూ గారడీ చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెయ్యి రోజులైనా ఇచ్చిన హామీలను అమలు చేయలేదు!" ప్రతి మహిళకు నెలకు ?2,500 18 ఏళ్లు నిండిన యువతులకు స్కూటీలు కళ్యాణలక్ష్మి ?1 లక్ష ం తులం బంగారం ఇలా ఎన్నో హామీలు ఇచ్చి మహిళలను మోసం చేశారని మండిపడ్డారు. "మహిళలను సులభంగా మోసం చేయొచ్చని కాంగ్రెస్ ప్రభుత్వం అనుకుంటే అది వారి భ్రమ. మహిళలు ఇచ్చిన మాటను మర్చిపోరు.. హామీల అమలు కోసం ప్రశ్నిస్తారు.. పోరాడుతారు!" అని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే కూడా మహిళే కదా.. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలి!" అని ఉషా దయాకర్ రావు డిమాండ్ చేశారు. ఎర్రబెల్లి దయాకర్ రావు సంచలన వ్యాఖ్యలు! రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి ప్రభుత్వాన్ని చూడలేదు! "ప్రజల తరఫున అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులతో అడ్డుకోవడం.. దాడులు చేయించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటు! మహిళా ప్రజాప్రతినిధుల పట్ల కూడా దురుసుగా వ్యవహరించిన ఈ ప్రభుత్వం మహిళలను ఎలా గౌరవిస్తుంది?" అని ప్రశ్నించారు. హామీలు అమలు చేయాలి! మహిళలకు న్యాయం చేయాలి! ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి! పాలకుర్తి మహిళల గర్జన.. కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరిక!



జనంవాయిస్ తెలుగు దినపత్రిక

# గణేష్ మండపాల నిర్వాహకులు,డీజే ఆపరేటర్లతో శాంతి కమిటీ సమావేశం..

**సెప్టెంబర్ 7 జనం వాయిస్ పాలకుర్తి:**
పాలకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జరగనున్న గణేష్ ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు, డీజే ఆపరేటర్లతో పాలకుర్తి పోలీసుల ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారు 50 మంది నిర్వాహకులు,సభ్యులు పాల్గొన్నారు. సీఐ పాలకుర్తి, ఎస్ఐ పాలకుర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపాన్ని తప్పనిసరిగా ఆన్‌లైన్/నిర్దేశిత విధానంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మండపం ఏర్పాటుకు సంబంధించి సంబంధిత అన్ని శాఖల నుంచి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని,




మండపం వద్ద కనీసం ముగ్గురు నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని,గణేష్ ఊరేగింపు మరియు నిమజ్జనం సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీసులకు పూర్తిగా సహకరించాలని, రిజిస్ట్రేషన్ సమయంలోనే నిమజ్జనం తేదీ మరియు నిమజ్జనం చేసే ప్రదేశం వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, డీజేలకు అనుమతి లేదని, డీజే ఆపరేటర్లు, నిర్వాహకులు పోలీసుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని,మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్నిమాపక భద్రత, తగిన లైటింగ్,భక్తుల భద్రతకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఊరేగింపు సమయంలో చిన్నపిల్లలు, మహిళలు,వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల మధ్య వివాదాలు లేదా మత విద్వేషాలకు దారితీసే నినాదాలు, ప్రసంగాలు, కార్యక్రమాలు నిర్వహించరాదని,గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సోదరభావంతో, పోలీసుల సూచనలను పాటిస్తూ నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

# కురవి ప్రభుత్వ భూములపై
# కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు

- ఎస్సీ బాలికల వసతిగృహాన్ని మార్చాలి.
- సర్వే నంబర్ 177లో ప్రభుత్వ భూములను కాపాడాలని విజ్ఞప్తి.
- అసైన్డ్ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలి.
- దైద భద్రయ్య, నూతకి సాంబశివరావు, కిన్నెర మల్లయ్య, ఇరుగు వెంకన్న డిమాండ్.

**కురవి, సెప్టెంబర్ 7 (జనం వాయిస్):**
మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ప్రభుత్వ, ఎస్సీ బాలికల వసతిగృహాన్ని మార్చాలని, సర్వే నంబర్ 177లో ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ గౌరవ జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ మహబూబాబాద్‌కు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేశారు. విద్యార్థినుల భద్రత, ప్రభుత్వ భూముల పరిరక్షణ, అసైన్డ్ భూముల ఆక్రమణలపై



అధికారులు సమగ్రంగా స్పందించాలని ఫిర్యాదుదారులు విజ్ఞప్తి చేశారు.

**ఎస్సీ బాలికల వసతిగృహాన్ని మార్చాలి :**
ప్రస్తుతం ఉన్న ఎస్సీ బాలికల వసతిగృహ భవన పరిస్థితులను పరిశీలించి, విద్యార్థినులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, భద్రతా సదుపాయాలు కలిగిన సురక్షిత భవనంలోకి వసతిగృహాన్ని మార్చాలని కోరారు. విద్యార్థినుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రభుత్వ భూముల కబ్జాలపై సమగ్ర విచారణ:**
కురవి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అక్రమ ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధంగా భూముల బదలాయింపులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**సర్వే నంబర్ 177ను పరిరక్షించాలి:**
కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 177లో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములు అక్రమంగా చేతులు మారకుండా రికార్డులను పరిశీలించి, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రజావాణి ఫిర్యాదులో దైద భద్రయ్య -- దళిత అవార్డు గ్రహీత, కురవి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు; నూతకి సాంబశివరావు -- వార్డు సభ్యులు; కిన్నెర మల్లయ్య -- సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత; ఇరుగు వెంకన్న -- కురవి మేజర్ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు పాల్గొని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యలపై సమగ్ర విచారణ జరిపి, సంబంధిత శాఖల అధికారులతో చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

# కురవిలో ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరపాలి

**... 275 ఎకరాల ప్రభుత్వ, సీలింగ్, పి.ఓ.టి, భూదాన్ భూముల రక్షణకు కలెక్టర్‌కు ఫిర్యాదు.**
**... రికార్డులు బహిరంగపరచి.. ఆక్రమణలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్.**

**కురవి, సెప్టెంబర్ 7 (జనం వాయిస్) :**
మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ, సీలింగ్, భూదాన్, పి.ఓ.టి, ప్రజాప్రయోజన భూముల పరిరక్షణకు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ సోమవారం కురవి మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు, దైద భద్రయ్య, రాగం వీరభద్రం, దళిత నాయకులు కిన్నెర మల్లయ్య తదితరులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. కురవి గ్రామ రెవెన్యూ పరిధిలో మొత్తం 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ, ఇతర కేటాయించిన భూములు ఉన్నట్లు తెలిపారు. ఇందులో అబాది 43 ఎకరాల 09 గుంటలు, సీలింగ్ భూములు 11 ఎకరాల 19 గుంటలు, ప్రభుత్వ భూమి 158 ఎకరాల 18 గుంటలు,




పి.ఓ.టి భూములు 57 ఎకరాల 35 గుంటలు, భూదాన్ భూమి 4 ఎకరాలు ఉన్నట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

**ఆక్రమణలను అరికట్టాలి :**
ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, కాలువలు తదితర ప్రజాప్రయోజన స్థలాలపై జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న ఆక్రమణలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అడ్డుకోవాలని కోరారు. ప్రతి ప్రభుత్వ భూమిని సమగ్రంగా సర్వే చేసి, సరిహద్దులను గుర్తించి ఫెన్సింగ్ లేదా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**రికార్డులు బహిరంగపరచాలని డిమాండ్ :**
ప్రతి భూమికి సంబంధించిన సర్వే నంబర్, విస్తీర్ణం, భూమి స్వభావం, ప్రస్తుత స్థితి, ఆక్రమణ వివరాలు స్పష్టంగా పొందుపరిచిన నివేదికను గ్రామ పంచాయతీ కార్యాలయంలో, సంబంధిత ఆన్‌లైన్ వేదికల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు.

**రెవెన్యూ--రిజిస్ట్రేషన్ రికార్డులపై విచారణ :**
ధరణి, పాత రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ శాఖ పత్రాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి పరిశీలించాలని ఫిర్యాదుదారులు కోరారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి, రికార్డుల్లో మార్పులు, అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయా అనే అంశాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

**పి.ఓ.టి భూములపై చర్యలు తీసుకోవాలి**
పి.ఓ.టి/అసైన్డ్ భూముల విషయంలో చట్ట నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు, విక్రయాలు లేదా ఆక్రమణలు జరిగి ఉంటే వాటిని గుర్తించి, నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కోరారు. చెరువులు, శిఖం భూములు, నీటి వనరులు, కాలువల ఆక్రమణలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం రెవెన్యూ యంత్రాంగం ప్రాథమిక బాధ్యత అని పేర్కొంటూ.. కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని భూములపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచి, ఆక్రమణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కురవి మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు, దైద భద్రయ్య, రాగం వీరభద్రం, దళిత నాయకులు కిన్నెర మల్లయ్య తదితరులు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# జీవో 97పై బీఆర్ఎస్వీ నిరసన.

**ఆర్డీవోకు వినతిపత్రం అందజేత..**
**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుపై నిరసన.**
**హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ రాస్తారోకో.**

**జనం వాయిస్.హుస్నాబాద్ సెప్టెంబర్ 7:**
పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అన్యాయం చేసేలా ఉన్న జీవో 97ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి ఆర్డీవో రామ్మూర్తికి వినతిపత్రం సమర్పించారు. శక్తి స్కీమ్ ద్వారా పాలిటెక్నిక్‌లను విలీనం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గాదెపాక రవీందర్, గడిపే సతీష్ తో పాటు ఎంఎ. అన్వర్, సుద్దాల చంద్రయ్య, ఐలేని మల్లికార్జున్‌రెడ్డి, సూరంపల్లి పర్శరాం, కన్నోజు రామకృష్ణ, కందుకూరి సతీష్, గడ్డం సదానందం, గుగులోతు తిరుపతి, ప్రభాకర్‌రెడ్డి, బొజ్జ హరీశ్, లక్ష్మణ్ నాయక్, చిత్తారి శ్రీనివాస్, కూతాటి విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# క్రమశిక్షణ, ప్రణాళికతోనే కొలువు సాధించవచ్చు

**పోలీస్ రిక్రూట్మెంట్ పై అవగాహన సదస్సు.**

**జనం వాయిస్ హుస్నాబాద్ సెప్టెంబర్.7**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్ నందు సోమవారం నాడు పోలీసు ఉద్యోగాల రిక్రూట్మెంట్ పై అవగాహన సదస్సును కె.ఎన్.ఆర్ ఇన్స్టిట్యూట్, కరీంనగర్ వారి సౌజన్యంతో వాణిజ్య శాస్త్ర విభాగము మరియు జాతీయ సేవా పథకం యూనిట్ వారు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ సరైన ప్రణాళిక, సమయపాలన, కార్యాచరణతోనే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చును అని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో పెద్ద సంఖ్యలో కానిస్టేబుల్ మరియు ఎస్సై ఉద్యోగాల నియామకపు ప్రవేశ ప్రకటన విడుదల చేసిందని, దానికిగాను కళాశాలలో పోటీ పరీక్షలకై అర్హులైన విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రిసోర్స్ పర్సన్ రాజు, కెఎన్ఆర్ ఇన్స్టిట్యూట్ మాట్లాడుతూ ఎస్సై మరియు కానిస్టేబుల్ ఉద్యోగాలకు కావలసిన అర్హతల గురించి, పరీక్షా విధానం, సిలబస్, జోనులవారీగా ఉద్యోగాల సంఖ్య, ప్రణాళిక రూపకల్పన, ప్రాథమిక అంశాలపై అవగాహనా మొదలగునవి సవివరముగా తెలిపారు. ఆశావాహులైన కళాశాల విద్యార్థులకు నామమాత్రపు రుసుముతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ కళాశాలలో పోటీ పరీక్షల కై ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి పోటీ పరీక్షల శిక్షణకై విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి. నైనా దేవి, డాక్టర్ చంద్రమౌళి ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.



# అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలి

**- నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ డోర్నకల్ నియోజకవర్గ కార్యదర్శి.**

**కురవి, సెప్టెంబర్ 7 (జనం వాయిస్):**
భూ కబ్జాదారుల పాలవుతున్న విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఐ డోర్నకల్ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కురవి మండల కేంద్రంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజావాణిలో ఎంపీడీవో వీరబాబుకి సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విలువైన ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ రెవిన్యూ అధికారులు నమ్మకు నేరెత్తినట్లుగా వ్యవహరించడం వలన భూ బకాసురులు బోగస్ పత్రాలతో ఆక్రమించుకుంటున్నారని సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి సూచిక బోర్డులు పెట్టాలని గతంలో అనేకసార్లు తహిసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చినప్పటికీ పెడచెవిన పెట్టడం వలన యదేచ్ఛగా అక్రమనలు జరుగుతున్నాయని, ఎస్సీ హాస్టల్ తో పాటు పలు కార్యాలయాలు ప్రైవేట్ భవనాలలో కిరాయిలకు, ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థలో ఉన్నది కాబట్టి నూతన భవనాల మంజూరి కోసం స్థలాలు కావాలని సాక్షాత్తు ఎమ్మెల్యే గారు రెవిన్యూ అధికారులను కోరినప్పటికీ కాగితాలలో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించకుండా తాత్సర్యం చేయటం,ఇటీవల పలు ఆరోపణలు రెవెన్యూ అధికారులపై వస్తున్నప్పటికీ కనీస స్పందన లేకపోవడంతో పలు అనుమానాలు వస్తున్నాయని,177 సర్వే నెంబర్ లో గత తాహిసిల్దార్ గారు హరిత హోటల్, మహిళలకు పెట్రోల్ బంకులకు,ఎంపీడీవో కార్యాలయానికి స్థలాన్ని ఇస్తానని చెప్పారు కాబట్టి 177 సర్వే నెంబర్ తో పాటు కొరవి గ్రామ కేంద్రంలో ఎంత ప్రభుత్వ భూమి ఉన్నదో తక్షణమే జిల్లా సర్వేయర్ తో సమగ్ర సర్వే చేయించి,హద్దురాళ్ళను సూచిక బోర్డులను కలెక్టర్ గారు ప్రత్యేక చొరవ తీసుకొని ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బుడమ వెంకన్న, దూది కట్ల సారయ్య, కన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




# ఫీజు బకాయిలు విడుదల చేయాలి.

**చలో అసెంబ్లీకి వెళ్లకుండా బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్టు.**
**పోలీసుల తీరుపై నిరసన కర్ణ కంటి నరేష్ బీజేవైఎం రాష్ట్ర నాయకుడు.**

**జనం వాయిస్.అక్కన్నపేట సెప్టెంబర్ 7:**
పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం బీజేవైఎం రాష్ట్ర నాయకుడు కర్ణకంటి నరేశ్ నిరసన తెలిపారు. చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా అక్కన్నపేట పోలీసులు బీజేవైఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని ఆయన ఖండించారు. విద్యార్థులకు రావాల్సిన రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేశ్ పిలుపు మేరకు చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టినట్లు నరేశ్ తెలిపారు. విద్యార్థుల హక్కుల కోసం ఉద్యమిస్తున్న నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో బీజేవైఎం అక్కన్నపేట మండల అధ్యక్షుడు సలేంద్ర తిరుపతి ఉన్నారు.



# ఫీజు బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం.. ప్రశ్నిస్తే అరెస్టులా

**కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం అంటే భయమా.**
**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం.**

**జనం వాయిస్.కోహెడ సెప్టెంబర్.7**



ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టేందుకు సిద్ధమైతే కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులు నిరాకరించడం సిగ్గుచేటని బీజేపీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం తీవ్రంగా మండిపడ్డారుబి శాంతియుత నిరసనకు అనుమతి ఇవ్వకుండా, ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను తెలియజేసేందుకు చలో అసెంబ్లీకి పిలుపునివ్వగానే తెల్లవారుజాము నుంచే బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేయించడం చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగా భయపడిపోతుందో అర్థమవుతోందన్నారుబి విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతులు రావు.. కానీ ప్రశ్నించే బీజేపీ నాయకులను అరెస్టు చేయడానికి మాత్రం ప్రభుత్వం పోలీసు బలగాలతో సిద్ధంగా ఉంటాయా? అని ఖమ్మం వేంకటేశం ప్రశ్నించారుబి ప్రజల సమస్యలపై పోరాడే గొంతులను అణిచివేయడం ద్వారా ఉద్యమాలను ఆపగలమని కాంగ్రెస్ ప్రభుత్వం పగటి కలలు కనవద్దని హెచ్చరించారు. అరెస్టులతో బీజేపీ ఉద్యమాన్ని ఆపలేరు.. నిర్బంధాలతో ప్రజల గొంతును నొక్కలేరు అని స్పష్టం చేశారు నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ విధంగా ప్రతిపక్షాల గొంతును అణిచివేసిందో.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అవలంబిస్తోందని విమర్శించారు. పార్టీలు మారాయి.. పాలకులు మారారు.. కానీ ప్రశ్నించే గొంతులను అణిచివేసే కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల తీరు మాత్రం మారలేదు. దొందూ దొందే! అని పద్ధతిలో పాలన సాగుతోందని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా విద్యార్థులను, కళాశాలలను ఇబ్బందులకు గురిచేస్తూ వారి భవిష్యత్తుతో ఆటలాడుతోందని అన్నారు. ఫీజు బకాయిలు చెల్లించడం ప్రభుత్వ ఉపకారం కాదు.. విద్యార్థుల హక్కు. ఆ హక్కు కోసం బీజేపీ చివరి వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు ముందస్తు అరెస్టులతో బీజేపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే అది కాంగ్రెస్ ప్రభుత్వ భ్రమ మాత్రమేనని, ఒక్క నాయకుడిని అరెస్టు చేస్తే వందలాది గొంతులు ప్రశ్నిస్తాయని.. వందల గొంతులను అరెస్టు చేస్తే వేలాది మంది రోడ్డెక్కుతారని హెచ్చరించారు ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొండివైఖరి వీడి ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ముందస్తు అరెస్టులు చేసిన బీజేపీ, బీజేవైఎం నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన ప్రజా ఉద్యమాన్ని చేపడతామని ఖమ్మం వేంకటేశం తెలిపారు

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామపంచాయతీ భవనానికి భూదానం.
### కోటియా తండాలో భూమిపూజ చేసిన సర్పంచ్ బాలాజీ నాయక్.

**(జనం వాయిస్):డోర్నకల్/మరిపెడ,సెప్టెంబర్ 07:**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని కోటియా తండా గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణం కోసం సర్పంచ్ తేజావత్ బాలాజీ నాయక్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం భూమిని దానంగా ఇవ్వడం గ్రామంలో అభినందనీయంగా మారింది.తన తల్లి తేజావత్ పోరీ మాజీ సర్పంచ్,తండ్రి జింత్ర నాయక్ జ్ఞాపకార్థంగా గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం సొంత స్థలాన్ని దాతగా అందజేశారు.అట్టి భూమిలో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి సర్పంచ్ తేజావత్ బాలాజీ నాయక్ సోమవారం భూమి పూజ నిర్వహించారు.గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారంగా తల్లిదండ్రుల పేరు చిరస్థాయిగా ఉండేలా ఈ భూదానం చేశానని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు.త్వరలోనే భవన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ గ్రామ నాయకులు తేజావత్ సోమన్న ,సిరి,చరణ్ రాజ్, సురేష్, బీమా, రమేష్, శివసింగ్, శివ, మధు,రవి,శ్రీరామ్, వీరన్న,శీను, రామన్న, సీతారాం, నరేష్,స్వామి, బాల, సోమన్న, వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు...

## డ్వాక్రా సంఘాల బలోపేతానికి బీఆర్ఆర్ ఫౌండేషన్ సహకారం
### .అయ్యవారిగూడలో మహిళా సంఘాలకు కుర్చీల పంపిణీ

**యాచారం, సెప్టెంబర్ 7 (జనం వాయిస్):**



మండలంలోని అయ్యవారిగూడ గ్రామంలోని డ్వాక్రా సంఘాలకు బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్ యాదవ్ పాల్గొని కుర్చీలను పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో మహిళా సాధికారతకు, డ్వాక్రా సంఘాల బలోపేతానికి బీఆర్ఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. మహిళా సంఘాలు సమావేశాలు నిర్వహించుకునేందుకు కుర్చీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. మహిళా సంఘాల అభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## 420 హామీల అమలుకు ఒత్తిడి..
### ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరుబాట
### అరెస్టులకు నిరసనగా ధర్నా

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 7:**





కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం శాయంపేట మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు సీనియర్ నాయకుడు వంగాల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

**420 హామీలపై ప్రజావాణిలో ఫిర్యాదు...**

అంబేద్కర్ సెంటర్ నుంచి నినాదాలు చేస్తూ ప్రజావాణికి చేరుకున్న నాయకులు వినతిపత్రం సమర్పించారు. రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు ఆర్థిక సాయం, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి తదితర హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ హామీల అమలులో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, వెంటనే కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

**మాందారిపేటలో బైఠాయింపు...**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టులను నిరసిస్తూ మాందారిపేట ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు బైఠాయించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నేతలను అడ్డుకోవడం సరికాదని నారాయణరెడ్డి అన్నారు. ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మారపల్లి నంద, శాయంపేట ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, దాసి శ్రావణ్‌కుమార్, రాజిరెడ్డి, కొమ్ముల శివ, చల్లా శ్రీనివాస్ రెడ్డి, మోహన్, రాజేందర్, గడిపే విజయ్‌కుమార్, అమ్మ అశోక్, నరేందర్, వెంకన్న,రంగు బాబు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి నక్కర్తలో ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

**యాచారం,సెప్టెంబర్ 7, (జనం వాయిస్):**



మండలంలోని మేడిపల్లి నక్కర్తలో ముదిరాజ్ ల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు కానమోని గణేష్ సర్పంచ్ ను ఘనంగా సన్మానించి ఆహ్వానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. పెద్దమ్మ తల్లి ఆశీర్వాదంతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని, గ్రామ అభివృద్ధికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.ముదిరాజ్ కులస్తులకు, గ్రామ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం పోరాడితే అరెస్టులా..?
### నరహరిశెట్టి రామకృష్ణ ఆగ్రహం

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 7:**




విద్యార్థుల కోసం పోరాడితే అరెస్టులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని బీజేపీ శాయంపేట మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ చేపట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునేందుకు శాయంపేట పోలీసులు సోమవారం తెల్లవారుజామున తనను ముందస్తుగా అరెస్టు చేశారని తెలిపారు.ఈ మేరకు రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయి విద్యార్థులు, విద్యాసంస్థలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్టులు, నిర్బంధాలతో బీజేపీ పోరాటాన్ని అడ్డుకోలేరని, విద్యార్థుల హక్కుల కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.అరెస్టయిన వారిలో ఏబీవీపీ నాయకుడు ఆకుతోట భానుప్రసాద్ ఉన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల్లో మండలం పేరు మార్పు
### ... కురవి స్థానంలో సీరోలు మండలంగా సవరించాలని కలెక్టర్‌కు వినతి

**మహబూబాబాద్, సెప్టెంబర్ 7 (జనం వాయిస్):**

స్మార్ట్ రేషన్ కార్డుల్లో సీరోలు మండలానికి బదులుగా కురవి మండలం పేరుగా నమోదైన తప్పిదాన్ని వెంటనే సరిచేయాలని సీరోలు మండల కేంద్రానికి చెందిన ప్రజలు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల్లో తమ నివాస ప్రాంతానికి సంబంధించిన మండలం సీరోలుగా నమోదు కావాల్సి ఉండగా, పొరపాటున కురవి మండలంగా నమోదైందని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మండలం పేరు తప్పుగా ఉండటంతో భవిష్యత్‌లో రేషన్ సరఫరా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ధృవపత్రాల జారీ, ఇతర ప్రభుత్వ సేవలు, అధికారిక రికార్డుల విషయంలో ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్డుల్లో నమోదైన కురవి మండలం పేరును తొలగించి, సీరోలు మండలంగా సవరించి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేయాలని వారు కోరారు. ప్రజల సమస్యపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా సంబంధిత అధికారితో కలెక్టర్ స్వయంగా మాట్లాడి సమస్యను క్లియర్ చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. దీంతో సీరోలు మండల ప్రజలు సమస్య త్వరితగతిన పరిష్కారం అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



# కురవి ప్రభుత్వ భూములపై 'జనం వాయిస్' కథనాలకు స్పందన..!

- వరుస కథనాలపై సీఎం కార్యాలయం ఆరా.
- జిల్లా కలెక్టర్ ద్వారా వివరాల సేకరణకు అధికారులకు ఆదేశాలు?.
- 275 ఎకరాల ప్రభుత్వ, సీలింగ్, పీఓటీ, భూదాన్ భూములపై ఫిర్యాదులు.
- సర్వే నంబర్ 177తో పాటు ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణకు డిమాండ్.


జనం వాయిస్
కురవిలో సర్కారు భూములకు 'కబ్జా' శరగోపం..!
కురవి ప్రభుత్వ భూములు ఎవరి స్వాధీనంలో..?
... 275 ఎకరాల ప్రభుత్వ భూమి మాయం. 'పెద్దల' చేతుల్లో బందీ!
... ఫిర్యాదులు ఎన్నో.. రెవెన్యూ శాఖ మౌనం ఎందుకో..?
... 43 ఎకరాల 09 గుంటల అబాది భూములపై ఆక్రమణ ఆరోపణలు
... 158 ఎకరాల 18 గుంటల ప్రభుత్వ భూములపై కబ్జా ఆరోపణలు
... 11 ఎకరాల 19 గుంటల సీలింగ్ భూములపైనా అక్రమాల కలకలం
... సర్కారు రికార్డుల్లో భూమి.. క్షేత్రస్థాయిలో కనిపించని హద్దులు!
... సర్వే నంబర్ 177, బై నంబర్లపై సమగ్ర సర్వేకు డిమాండ్
... కలెక్టర్, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా కనిపించని చర్యలు
... సీపీఐ నేతల వినతి.. ప్రభుత్వ భూములకు బోర్డులు ఏర్పాటు చేయాలి
... బోర్డులు పెట్టాలని ప్రజావాణిలో ఫిర్యాదులు.. అయినా కదలని రెవెన్యూ యంత్రాంగం!


**మహబూబాబాద్, సెప్టెంబర్ 7 (జనం వాయిస్):**

మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణల ఆరోపణలు, రికార్డుల పరిశీలనపై 'జనం వాయిస్' దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలకు స్పందన లభించినట్లు సమాచారం. ప్రభుత్వ భూముల అంశంపై ప్రచురితమైన కథనాల నేపథ్యంలో తెలంగాణ సీఎం కార్యాలయం జిల్లా కలెక్టర్ ద్వారా వివరాలు ఆరా తీస్తున్నట్లు అధికార వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ, అబాది, సీలింగ్, పి.ఓ.టి., భూదాన్ తదితర భూములపై అనుమానాలు, ఆక్రమణల ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ ఇటీవల 'జనం వాయిస్' వరుస కథనాలను ప్రచురించింది. ముఖ్యంగా సర్వే నంబర్ 177తో పాటు ప్రభుత్వ భూములను గుర్తించి, సమగ్ర సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు అధికారులను కోరుతున్నారు.

**275 ఎకరాల భూములపై విచారణకు డిమాండ్**

కురవి గ్రామ రెవెన్యూ పరిధిలో రికార్డుల ప్రకారం 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ, ఇతర కేటాయింపు భూములు ఉన్నట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. ఇందులో అబాది 43 ఎకరాల 09 గుంటలు, సీలింగ్ 11 ఎకరాల 19 గుంటలు, ప్రభుత్వ భూమి 158 ఎకరాల 18 గుంటలు, పి.ఓ.టి. భూములు 57 ఎకరాల 35 గుంటలు, భూదాన్ భూమి 4 ఎకరాలు ఉన్నట్లు వారు వెల్లడించారు. ఈ భూములన్నింటినీ క్షేత్రస్థాయిలో సర్వే చేసి, రికార్డులతో సరిపోల్చి, ఆక్రమణలు లేదా అక్రమ బదలాయింపులు జరిగాయా అనే అంశాన్ని నిగ్గు తేల్చాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి.

**సర్వే నంబర్ 177పై ప్రత్యేక దృష్టి**

కురవి గ్రామంలోని సర్వే నంబర్ 177లో ఉన్న ప్రభుత్వ భూములపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వ భూముల హద్దులను గుర్తించి హద్దురాళ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు భవిష్యత్‌లో ఆక్రమణలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**'జనం వాయిస్' ఎక్స్ పోస్టులకు స్పందన**

ప్రభుత్వ భూముల అంశంపై ప్రచురించిన వరుస కథనాలను 'జనం వాయిస్' జిల్లా బ్యూరో బేతమళ్ల సహదేవ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలంగాణ సీఎస్, సీఎం కార్యాలయం, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం కార్యాలయం స్పందించి జిల్లా కలెక్టర్ ద్వారా కురవి ప్రభుత్వ భూముల అంశంపై వివరాలు సేకరిస్తున్నట్లు అధికారుల ద్వారా సమాచారం వెలువడింది.

**వాస్తవాలు వెలుగులోకి రావాలనే డిమాండ్**

కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములపై వస్తున్న ఆరోపణలు, రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు. ఆక్రమణలు, అక్రమ బదలాయింపులు లేదా రికార్డులలో అవకతవకలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. 'జనం వాయిస్' వరుస కథనాలపై ఉన్నతస్థాయిలో స్పందన రావడంతో కురవి ప్రభుత్వ భూముల వ్యవహారంపై అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపడుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ప్రజావాణి అర్జీల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

- ప్రజావాణికి 144 దరఖాస్తులు సంబంధిత శాఖలకు తక్షణమే పంపిన అధికారులు.
- సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి : కలెక్టర్ స్నేహ శబరిష్.



**మహబూబాబాద్, సెప్టెంబర్ 7 (జనం వాయిస్):**

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. సోమవారం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇంచార్జీ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పీడీ పురుషోత్తం, డీఆర్వో నాగలక్ష్మి, న్యాయ సేవ సంస్థ ప్రతినిధి ఆనంద్ కుమార్, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారులకు సిఫారసు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను స్వయంగా పరిశీలించాలని ఆదేశించారు. అర్జీపై తీసుకున్న చర్యలను లేదా తిరస్కరణకు గల కారణాలను దరఖాస్తుదారులకు లిఖితపూర్వకంగా లేదా ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయాలని, ప్రజావాణి పోర్టల్‌లో అర్జీల స్థితిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రజావాణికి వచ్చే అర్జీదారులు స్పష్టమైన అక్షరాలతో దరఖాస్తు రాయాలని, పేరు, చిరునామా, ఫోన్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులు సూచించారు. సమస్యకు సంబంధించిన ఆధార్, రేషన్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్ తదితర ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులను జత చేయాలన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటలలోపు పేరు నమోదు చేసుకుని, టోకెన్ ప్రాతిపదికన అధికారులను కలవాలని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు పాత అర్జీ లేదా ఐడీ నంబర్‌ను కొత్త దరఖాస్తుతో పాటు సమర్పించాలని సూచించారు. జిల్లాలోని అన్ని శాఖల ముఖ్య అధికారులు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజావాణికి తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు కాకూడదన్నారు.

**ప్రజావాణికి 144 దరఖాస్తులు :**


సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 144 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిని సంబంధిత శాఖలకు తగు చర్యల నిమిత్తం వెంటనే పంపినట్లు వెల్లడించారు.


**పట్టాదార్ పాస్‌బుక్కుల పంపిణీ :**

అంతకుముందు నారాయణపురం గ్రామానికి చెందిన దారావత్ రవి నాయక్, యమునా సర్పంచ్, కైక, వెంకట్ రెడ్డి, సుమన్, శ్రీలతలకు పట్టాదార్ పాస్‌బుక్కులను అందజేశారు. అనంతరం వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరుతూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో జరిగేది 'గౌరవ సభ కాదు.. కౌరవ సభ

... కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన ప్రజావ్యతిరేకంగా మారింది.
... మాజీ మంత్రి సత్యవతి రాథోడ్.





**మహబూబాబాద్, సెప్టెంబర్ 7 (జనం వాయిస్) :**

తెలంగాణలో ప్రస్తుతం కొనసాగుతున్నది గౌరవ సభ కాదని, కౌరవ సభగా మారిందని బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల అసమర్థ పాలన, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఆమెతో పాటు మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్ నాయక్, డీఎస్ రెడ్యానాయక్, మాజీ జడ్పీ చైర్మన్ బిందు అంగోత్, బీఆర్ఎస్ నాయకులు దరఖాస్తు సమర్పించారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ సోమవారం మహబూబాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాలో సత్యవతి రాథోడ్ మాట్లాడారు. "గౌరవ సభ ముందు కౌరవ పర్వం కనిపించింది. శాసనసభ ముందు నేడు జరిగిన ఘటనలో దుశ్శాసన పర్వం మరోసారి కనిపించింది" అని ఆమె తీవ్రంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందించడం లేదని, ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. మహిళా నేతలపై కూడా ప్రభుత్వం దుశ్శాసన పర్వాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. "మహిళలకు బయట రక్షణ లేకపోవడం ఒక ఎత్తయితే.. అసెంబ్లీలో కూడా రక్షణ లేదా?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు వస్తాయని సత్యవతి రాథోడ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు చివరి కిరణంగా కిరణ్‌కుమార్‌రెడ్డి నిలిచారని, తెలంగాణలో కాంగ్రెస్‌ను బొంద పెట్టే ఆఖరి కిరణం రేవంత్‌రెడ్డి అవుతారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కొనసాగుతోందని ఆమె ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తున్న ప్రతిపక్ష నాయకులపై అధికార యంత్రాంగాన్ని ప్రయోగించడం సరికాదన్నారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం స్పందించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ కు బుద్ధిచెప్పాలి

... 1000 రోజుల పాలనలో హామీల అమలులో పూర్తిగా విఫలం.
... బీఆర్ఎస్ సమరభేరి దీక్షలో మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యానాయక్.

**కురవి, సెప్టెంబర్ 7 (జనం వాయిస్):**

420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ కు బుద్ధిచెప్పాలని మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యానాయక్ ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'సమరభేరి 'దీక్ష' చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు, మహిళలు, కార్యకర్తలు ప్లకార్డులు చేతబట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రెడ్యానాయక్ పాటు పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ర్యాలీగా సమరభేరి దీక్షా స్థలానికి చేరుకున్నారు. దీక్షలో భాగంగా కాంగ్రెస్ ఎన్నికల హామీలను గుర్తు చేస్తూ 'కాంగ్రెస్ బాకీ కార్డులను' ప్రజలకు పంపిణీ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4,000 పెన్షన్, దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు వంటి హామీలు అమలు కాలేదని వారు విమర్శించారు. రైతు భరోసా, రుణమాఫీ, వరి పంటకు క్వింటాల్కు రూ.500 బోనస్, రైతు ఉపాధి హామీ పథకం కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల సాయం, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డు, ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల సాయం తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్పాలని రెడ్యానాయక్ పిలుపునిచ్చారు. రేవంత్రెడ్డి ప్రభుత్వ పాలనపై దృష్టి పెట్టకుండా బూతుల పురాణానికి ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ప్రభుత్వ పాలకులు ప్రజా సంక్షేమం కంటే సంపాదన, కమీషన్లపైనే దృష్టి పెట్టారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కూరగాయల సాగుతో లక్షల్లో ఆదాయం..!

... బోర్లు, బావుల కింద నిత్య ఆదాయం ఇచ్చే పంటలపై దృష్టి సారించాలి.
... పంట మార్పిడితో ఆర్థికాభివృద్ధి సాధించాలి: ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న.

**మహబూబాబాద్, సెప్టెంబర్ 7 (జనం వాయిస్) :**



బోర్లు, బావుల కింద నీటి వసతి ఉన్న రైతులు వరి, మొక్కజొన్న, పత్తి, మిరప వంటి సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా నిత్యం మార్కెట్ డిమాండ్ ఉన్న అన్ని రకాల కూరగాయలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న సూచించారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మిషన్ వైవిధ్యం కార్యక్రమంలో భాగంగా సోమవారం నెల్లికుదురు మండలం సీతారాంపురం గ్రామంలో కూరగాయల పందిరి సాగు, మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో కూరగాయల సాగు చేయాల్సిన అవసరం ఉండగా ప్రస్తుతం దాదాపు 2 వేల ఎకరాల్లోనే సాగు జరుగుతోందని తెలిపారు. కూరగాయల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచి రైతులు ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. టమోటా, వంకాయ, బెండ, బీర, సొరకాయ, కాకరకాయ, పచ్చిమిర్చి, గోరుచిక్కుడు, ఆకుకూరలు, బీట్‌రూట్, క్యారెట్, ముల్లంగి, క్యాబేజీ, కాలీఫ్లవర్, కంద, చేమ, దొండ, పొట్లకాయ, ఉల్లి తదితర కూరగాయలకు ఏడాది పొడవునా మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని వివరించారు. అనుకూల పరిస్థితుల్లో సంవత్సరానికి మూడు నుంచి నాలుగు పంటలు తీసుకుంటూ ఎకరానికి రూ.2 లక్షలకు పైగా ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. కూరగాయల సాగు ద్వారా రైతులకు నిరంతర ఆదాయంతో పాటు గ్రామీణ యువత, స్వయం సహాయక సంఘాలకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరి, మొక్కజొన్న, పత్తి, మిరప సాగు విస్తీర్ణాన్ని కొంతమేర తగ్గించి, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల సాగు చేపట్టడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని మరియన్న పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మాదిరిగా క్రమం తప్పకుండా ఆదాయం వచ్చేలా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అన్ని రకాల కూరగాయలను ఆహారంలో భాగం చేసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, సాధ్యమైనంత వరకు ప్రకృతి సేద్యం ద్వారా కూరగాయలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. "ఎట్ అల్ వెజిటల్స్ -- హేట్ కాన్సర్" అనే సందేశంతో ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు.